క్లుప్తంగా

శాస్త్రోక్తంగా చండీహోమం



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన వినుకొండ అంకమ్మ ఆలయంలో సోమవారం చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా తొలుత ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- పశుసంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు



సబ్ డివిజన్ కార్యాలయంలో పరిశీలిస్తున్న జేడీ, ట్రెయినీ కలెక్టర్

కోవూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు సంవర్థక శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆయన పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. అదేవిధంగా గత నెలలో కూడా పీపీఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభించామని, ఇప్పటివరకు 14.84 లక్షల మేకలు, గొర్రెలకు టీకాలు వేసినట్లు తెలియజేశారు. ఇప్పటివరకు జిల్లాలో సార్టెడ్ సెమన్ ఆరు వేలు వేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 3 వేలు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, డీఎల్డీఏ ఈడీ డాక్టర్ సోమయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మౌర్య, యశోద తదితరులు పాల్గొన్నారు.

విజయ దీపిక పుస్తకాల పంపిణీ



కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పదో తరగతి విద్యార్థులకు విజయ దీపిక పుస్తకాలను డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు జి.వసంత కుమారి, ఎస్.అంకయ్య, హెచ్ఎంలు రామలింగయ్య, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



కోవూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా అన్నారు. కోవూరు మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఉన్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పెయ్యదూడల పథకం, మేలుజాతి సార్టెడ్ సెమన్ సేకరణ తదితరాలపై ఈఓ సోమయ్య ఆమెకు వివరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు, అసిస్టెంట్ డైరెక్టర్ యశోద ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం కృషి

- వాడవాడలా జన భాగీదారీ



కొడవలూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

కొడవలూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా నార్తురాజుపాళెంలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగం ప్రవేశికను చదివి వినిపించి రాజ్యాంగం పట్ల గౌరవం కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం కల్పించాలని అంబేడ్కర్ సూచించారని, ఆ విధంగా మన ముఖ్యమంత్రి మహిళలకు మంత్రి పదవుల్లో, స్థానిక సంస్థల్లోనూ సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ఈనెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించే నేపథ్యంలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మధుసూదన్‌రెడ్డి, ఎస్.మాణిక్యరావు, జి.జనార్ధన్‌రెడ్డి, ఈవీ నారపరెడ్డి, జి.సునీల్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నాయకులు, అధికారులు జన భాగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా దంపూరులో సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, ఎంపీటీసీ భానుప్రకాశ్, వైఎస్సార్‌సీపీ నేత శివరామిరెడ్డి పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని జొన్నవాడ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ అంబేడ్కర్ ఆలోచనలు ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. జొన్నవాడ ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కోవూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నట్లు ఈ సందర్భంగా పలువురు నేతలు తెలిపారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధా కృష్ణారెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అన్నారు. స్థానిక యూపీస్కూల్‌లో జన భాగీదారీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి అంజలి ఘటించారు. అనంతరం ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

మనుబోలు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వెలుగు ఏపీఎం వనజాక్షి పిలుపునిచ్చారు. మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో కలిసి రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు హరగోపాల్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, నవకోటి పాల్గొన్నారు.

వెంకటాచలం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జెడ్పీటీసీ పొట్లూరు సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ ముజీబున్నీసా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు.

తోటపల్లిగూడూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అరుదైన గౌరవం లభిస్తోందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో జన భాగీదారీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇస్కపాళెంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శంకరయ్యగౌడ్‌తో పాటు పార్టీ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు రాయపు శీనయ్య, ఎంబేటి సంధ్యారాణి పాల్గొన్నారు.



విడవలూరు : దంపూరు గ్రామంలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ సెంటర్‌లో..



మనుబోలు : ప్రతిజ్ఞ చేస్తున్న పొదుపు మహిళలు



వెంకటాచలం: ఎంపీడీఓ కార్యాలయంలో..



తోటపల్లిగూడూరు: ఇస్కపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, చిన్నారులు



కోవూరు మండల కేంద్రంలో..



ముత్తుకూరు : అంబేడ్కర్ సైకత శిల్పాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కార్ పాఠశాలలకు మహర్దశ పట్టిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇందుకూరుపేటలో రూ.3.95 కోట్లతో నిర్మించిన నూతన సీహెచ్‌సీని ఎమ్మెల్యే ప్రసన్న సోమవారం ప్రారంభించారు. అనంతరం కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 350 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, 120 మందికి నూతన రేషన్‌కార్డులతో పాటు నూతన పింఛన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 350 ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. దీనిపై కూడా పచ్చపత్రికలు విషం కక్కడం బాధాకరమన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించలేదని, ప్రస్తుత ప్రభుత్వం సర్కార్ పాఠశాలల రూపరేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు తెలియజేశారు. మండలంలో నూతనంగా 125 పింఛన్లు మంజూరు కాగా వీటితో కలిపి 8,986 మందికి ప్రతినెలా రూ.2.70 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో పింఛన్ల కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు పడే దుస్థితి ఉండేదని, ఈ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్ అందుతోందన్నారు. ప్రతిపక్ష నేతల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత బట్టేపాటి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



దివంగత వైఎస్సార్ విగ్రహావిష్కరణలో మంత్రి కాకాణి, వీసీ సుందరవల్లి

వెంకటాచలం : విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, రూ.95 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును మంత్రి కాకాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆలోచనతో దివంగత వైఎస్సార్ జిల్లాకోక విశ్వవిద్యాలయంలో భాగంగానే నెల్లూరులో వీఎస్‌యూ ఏర్పాటైందన్నారు. అయితే కాకుటూరు వద్ద వీఎస్‌యూకు స్థలం కేటాయించిన తరువాత వైఎస్సార్ మరణించడంతో ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు వీఎస్‌యూ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వీఎస్‌యూలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయని తెలియజేశారు. వీసీ సుందరవల్లి ప్రత్యేక శ్రద్ధ వల్ల వీఎస్‌యూ రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. వీఎస్‌యూను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరో రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారని, రాబోయే రోజుల్లో నిధులు మంజూరు చేసి వీఎస్‌యూను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. మానవ వనరుల అభివృద్ధే, నిజమైన అభివృద్ధి అనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలియజేశారు. వీసీ సుందరవల్లి మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ కృషితో వీఎస్‌యూ ఏర్పాటై, ఎంతో మందికి ఉన్నత విద్య అందుతోందన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేయడంతో ఇటీవల కాలంలో వీఎస్‌యూ రూపురేఖలు మారాయన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల ఏఏబీ చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమారెడ్డి, కుంకాల ఏడుకొండలు, షేక్.షాజహాన్, హుస్సేన్ పాల్గొన్నారు.

చంద్రగిరి రోశయ్యకు నివాళి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కామ్రేడ్ చంద్రగిరి రోశయ్య 18వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహోన్నతుడు రోశయ్య అని కొనియాడారు. రోశయ్య కృషివల్లే పట్టణంలోని షాదీమంజిల్, కూరగాయల మార్కెట్ నిర్మాణం జరిగిందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, నాయకులు షేక్ జానీబాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా పెంచలయ్య

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా మండలంలోని డేగపూడికి చెందిన గార్ల పెంచలయ్యను నియమించారు. ఈయన గతంలో డేగపూడి ఎంపీటీసీ సభ్యునిగా పనిచేశారు. తనకు జిల్లాస్థాయి పదవి లభించేందుకు కృషి చేసిన మంత్రి కాకాణికి పెంచలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్

పొదలకూరు : లింగంపల్లి గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు కై తేపల్లి శ్రీనివాసులుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం రూ.10 వేల పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగానికి పెద్దపీట వేసినట్లు ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 88 మంది పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల కేరింతల నడుమ భోగి మంటలు వేయించారు. ఉపసర్పంచ్ అనితారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అండగా జగనన్న



లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ అనితమ్మ

మనుబోలు : దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా నెలకు రూ.3 వేల పింఛన్ అందజేస్తూ అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రూ.3 వేల పింఛన్‌ను ఆమె వైఎస్సార్‌సీపీ నేత అజయ్ కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారన్నారు. ప్రజలకు ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

మనుబోలు : ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పాఠశాలల పీడీలు, పంచాయతీ కార్యదర్శులతో ఆడుదాం ఆంధ్రాపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో రాణించి మండల స్థాయికి ఎంపికైన జట్లకు మనుబోలు మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 102 టీమ్‌లు పాల్గొంటాయని వివరించారు. క్రికెట్‌లో 14 పురుషుల జట్లు, 7 మహిళల జట్లు, బ్యాడ్మింటన్‌లో 13 పురుషుల, 10 మహిళల జట్లు, ఖోఖోలో 10 పురుషుల, 9 మహిళల జట్లు, వాలీబాల్‌లో 12 పురుషుల, 7 మహిళల జట్లు, కబడ్డీలో 14 పురుషులు, 10 మహిళల జట్లు పాల్గొంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఓ రవికుమార్‌రెడ్డి, పీడీలు కామాక్షి, ప్రమీలారాణి, సరిత, మధుసూదన్‌రావు, మురళీమోహన్, కార్యదర్శులు రేష్మసోని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుద్దాం



దుస్తులను అందజేస్తున్న ఎంఈఓ శేషాద్రివాసు

మనుబోలు : దివ్యాంగులకు ప్రతిఒక్కరూ అండగా నిలుద్దామని ఎంఈఓ శేషాద్రివాసు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ ఆంగ్ల అధ్యాపకుడు పీవీ రమేష్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భవిత కేంద్రంలోని 20 మంది దివ్యాంగ చిన్నారులకు సంక్రాంతి కానుకగా సోమవారం ఎంఈఓ చేతుల మీదుగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడడం తగదని, వారికి మనోధైర్యం ఇస్తే ఏదైనా సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు డేవిడ్, వసంతకుమారి, కో-ఆప్షన్ మెంబర్ అనమాల ప్రభాకర్‌రెడ్డి, ఐఆర్పీలు శ్యామల, షర్మిల ఉన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి



విడవలూరు : విద్యార్థులకు ముగ్గుల పోటీలు

విడవలూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం ఎమ్.రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసులు, డి.నరసింహరావు, పి.ప్రసాద్, సీహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భోగి సంబరాలు

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు భోగి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా రంగవల్లులు, భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి పాల్గొని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు విజయ దీపిక పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత మహబూబ్ బాషా, హెచ్ఎం మోహన రామలింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ముత్తుకూరు : స్థానిక ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో భోగి మంటలు వేసి కేరింతలు కొట్టారు.



కొడవలూరు: యల్లాయపాళెం హైస్కూల్‌లో..



ముత్తుకూరు హైస్కూల్‌లో..